క్లుప్తంగా

ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయాలి


ఐటీబీపీ 56వ బెటాలియన్ సిబ్బందితో వెంకటరావు

తగరపువలస: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఐటీబీపీ 56వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి కోరారు. ఆనందపురం మండలం తర్లువాడలో పందలపాక ఐటీబీపీ 56వ బెటాలియన్ సిబ్బంది సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహించి జాతీయ జెండాలను అందించారు. స్వాతంత్య్ర దినోత్సవం ఆవశ్యకతను వివరించి ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయాలని కోరారు. • భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో సర్పంచ్ గాడు వెంకట నారాయణ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' నిర్వహించారు.

16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


తగరపువలస: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ప్రతినిధులు ఈ నెల 16 నుంచి 19 వరకు భోగాపురం మండలం గుడివాడలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రబోధానందుని శిష్యులు మొక్క వెంకటరమణ, బోని రావణ అక్షయ్ చిట్టివలసలో సోమవారం వివరాలు తెలియజేశారు. ప్రతిరోజూ మండపం వద్ద ఉదయం 7 గంటలకు, సాయంత్రం 7 గంటలకు శ్రీకృష్ణ భగవానునికి పూజా కార్యక్రమాలు, భగవద్గీత శ్లోకాల పఠనం ఆచార్య ప్రబోధానందుని త్రిమత గ్రంథాలకు సంబంధించిన ప్రసంగాల డీవీడీలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. 19న మధ్యాహ్నం 3 గంటల నుంచి భారీ ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. వివరాలకు శ్రీకృష్ణ భక్తులు 96666 50000, 97045 29963 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పూర్వ విద్యార్థి వితరణ


పూర్వ విద్యార్థి సూర్య, అన్నపూర్ణ దంపతులు అందించిన సామగ్రి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి కాగితాలపేటకు చెందిన మజ్జి సూర్య, అన్నపూర్ణ దంపతులు సోమవారం పాఠశాలకు రూ.15వేల విలువైన 18/36 పొడవైన వాటర్ ప్రూఫ్ టెంట్, సైడ్‌వాల్, కర్రలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యుడు బోని కనకారావు, ఇజ్జాడ అప్పలరాజు, కాగితాల రాజారమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామలక్ష్మి, సిబ్బంది

భీమునిపట్నం: భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. రెండురోజుల క్రితం అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 16 సబ్ జూనియర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భీమిలి గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.లాస్యశ్రీ, ఎ.భువన, బి.సిరి ప్రసన్న ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. విజేతలను సోమవారం పాఠశాల వద్ద ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామలక్ష్మి, పీఈటీ మహాలక్ష్మి, మండల బ్యాడ్మింటన్ కార్యదర్శి ఎం. శంకరావు, సిబ్బంది అభినందించారు.

వేములవలస పీఏసీఎస్ అధ్యక్షుడిగా నాగరాజు



తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పీఏసీఎస్ అధ్యక్షుడిగా బంటుపల్లి కళ్లాలకు చెందిన రైతు నాగరాజు నియమితులయ్యారు. రైతు సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

కబ్జాలు.. దౌర్జన్యాలు

8వ వార్డులో మితిమీరుతున్న ఆక్రమణలు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై దాడులు
- ఆక్రమణలు ప్రోత్సహిస్తున్న స్థానిక నాయకులు


రాజీవ్‌నగర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం


గణేష్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో మాయమైన హెచ్చరిక బోర్డులు

కొమ్మాది: కోట్లలో పలుకుతున్న భూముల విలువతో ఆక్రమణదారుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో సెంటు స్థలం విలువ సుమారు రూ.50 లక్షలకు పైగా ఉండటంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కబ్జా చేసేస్తున్నారు. అధికారుల నామమాత్రపు చర్యలతో కబ్జాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎక్కడైనా అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు వారిపై దౌర్జన్యాలకు కూడా పాల్పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మేనేజ్ చేసేస్తూ..

వార్డు పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, గెడ్డలు కప్పేసినా, పార్కు స్థలాలను పార్కింగ్ స్థలాలుగా మార్చేసినా, కొండలు తవ్వేసినా, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినా అధికారుల చర్యలు అంతంత మాత్రమే. దీనిని అదునుగా తీసుకుని పలువురు స్థానిక నాయకులు ప్రభుత్వ స్థలాలను ముందుగా ఆక్రమించి, వాటిని 70, 80, 100 గజాలుగా విభజించి లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. దీనికి అక్కడ ఉన్న స్థానిక పెద్ద మనిషి ఒక ప్లాటుకు రూ. 2 లక్షలు తీసుకుని అధికారులను అందరినీ మేనేజ్ చేస్తానంటూ సొమ్ము చేసుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా విభజించి..

ఎండాడ, రాజీవ్‌నగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఆక్రమణలు తారస్థాయికి చేరుకున్నాయి. రాజీవ్‌నగర్‌లో ఏకంగా ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేశారు. ఈ కొండ ప్రాంతం అంతా ఇప్పటికే ఆక్రమణలతో నిండిపోయింది. స్థలాలను కొనుగోలు చేసి నిర్మాణాలు కూడా పూర్తి చేసేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని అమ్మేందుకు మరికొన్ని ప్లాట్లు సిద్ధం చేశారు.


రాజీవ్‌నగర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఖాళీ స్థలాలకు ఇంటి పన్ను

ఇక్కడ ఖాళీ స్థలాల్లో కరెంటు మీటర్లు ఏర్పాటు చేసి, హౌస్ ట్యాక్స్ కోసం దరఖాస్తు చేసేస్తున్నారు. సిబ్బంది కూడా చూసీచూడనట్లు వ్యవహరించి, ఇల్లే లేకుండా హౌస్ ట్యాక్స్ వేసేస్తున్నారు. సచివాలయ సమీపంలోనే ఇదంతా జరగడం గమనార్హం. గణేష్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మాయం చేసి, ప్రస్తుతం ఆ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. తిమ్మాపురం, రుషికొండ, స్వర్ణభారతి నగర్, సాగర్‌నగర్ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు గురవుతున్నాయి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాల్సి ఉంది.

అధికారులపై దౌర్జన్యం

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడమే కాదు, ఆ ఆక్రమణలు అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారులు దౌర్జన్యాలు చేసిన సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల తిమ్మాపురంలో, రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలు అడ్డుకుంటున్న సమయంలో రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో అధికారులు పోలీసుల భద్రతతో ఆక్రమణలు తొలగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

బోరు తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఎండాడ, రాజీవ్‌నగర్‌లో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలం ఆక్రమించడంతో పాటు ఆ స్థలంలో అనధికారికంగా బోరు వేశాడు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన ఆర్‌ఐ హరితేజపై ఆక్రమణదారుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆదేశాల మేరకు సోమవారం వీఆర్వో వెంకటేష్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి బోరును మూసివేశారు. ఇదిలా ఉండగా ఈ కొండపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తే మరిన్ని ఆక్రమణలు బయటపడతాయని స్థానికులు అంటున్నారు.

దౌర్జన్యం చేస్తే క్షమించం

విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం చేస్తే క్షమించేది లేదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. 8వ వార్డులో ఆక్రమణలపై సంబంధిత అధికారులను సమగ్ర వివరణ కోరాం. ఇప్పటికే పలు చోట్ల ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నాం. మిగిలిన ఆక్రమణలు పూర్తి స్థాయిలో పరిశీలిస్తాం. ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం.

– సంగీత్ మాథూర్, ఆర్డీవో

బదిలీల కోసం అధ్యాపకుల నిరసన

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమకు సాధారణ బదిలీలు చేయాలని, జీవో నంబర్ 42ను రద్దు చేయాలని, డిగ్రీ కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ముగిసిన హెరిటేజ్ ఫెస్ట్


పెయింటింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 2న ప్రారంభమైన హెరిటేజ్ ఫెస్ట్–2025 సోమవారం నాటి పాట్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలతో ముగిసింది. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన మోహన్ మందిరంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోటీలు జరిగాయి. 20 పాఠశాలలకు చెందిన 250 మంది బాలబాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస, ప్రతినిధి అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ రైతుల ఆందోళన


పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూది కొండ సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం పేరుతో చేపడుతున్న పనులను నిలిపివేయాలని రెండో రోజు సోమవారం కూడా రైతులు ఆందోళన చేశారు. ఆదివారం రైతులు ఈ పనులను అడ్డుకోవడంతో నిర్వాహకులు పనులు నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, సోమవారం మళ్లీ జేసీబీ తీసుకువచ్చి నీలగిరి మొక్కలను తొలగిస్తుండగా రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో నిర్వాహకులకు రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూముల్లోని మొక్కలను తొలగించడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, అడ్డు తగిలితే కేసులు బనాయిస్తామని నిర్వాహకులు రైతులను బెదిరించారు. అయినప్పటికీ రైతులు వెనుకంజ వేయకుండా పనులు నిలిపివేస్తేనే ఇక్కడ నుంచి వెళతామని స్పష్టం చేశారు. దీంతో నిర్వాహకులు పనులు నిలిపివేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

సచివాలయంలో చోరీ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం పరిధి మంగమారిపేట సచివాలయంలో చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. వరుసగా మూడు రోజుల సెలవుల అనంతరం సోమవారం యథావిధిగా సచివాలయం తెరిచేందుకు అధికారులు వెళ్లేసరికి సచివాలయ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో అడ్మిన్ సెక్రటరీ నాగగౌరి పోలీసులకు ఫిర్యాలు చేశారు. రెండు సెల్ ఫోన్లు, ఫింగర్‌ప్రింట్ డివైజ్ చోరీకి గురైనట్లు ఆమె తెలిపారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను గుర్తించేందుకు పోలీసులు క్లూస్‌టీంను రప్పించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గతంలోనూ రెండు పర్యాయాలు చోరీకి గురైనా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఈ చోరీలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ టోర్నీ


ట్రోఫీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: భీమిలికి చెందిన కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్వర్గశ్రీ ఉత్తరాంధ్ర ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. టోర్నీ ట్రోఫీని, పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం తగరపువలసలో ఆవిష్కరించారు. స్వర్గశ్రీ జయంతి సందర్భంగా భీమిలి వుడా మినీ మైదానంలో నాలుగు రోజుల పాటు రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, అత్తిలి చినబాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలసకు ప్రాధాన్యం కల్పించాలని వినతి

తగరపువలస: వివిధ పోటీ పరీక్షలకు ప్రధాన కేంద్రంగా ఉన్న చిట్టివలసకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ చిట్టివలస పరిరక్షణ సమితి అధ్యక్షుడు బల్లా వెంకటరావు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తగరపువలసతో రోడ్డు సరిహద్దు కలిగిన చిట్టివలసలోనే పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. బస్సులపై తగరపువలస పేరు తప్ప చిట్టివలస పేరు ఎక్కడా కనిపించకపోవడంతో అభ్యర్థులు తరచూ అయోమయానికి గురవుతున్నారన్నారు. భీమిలి నియోజకవర్గంలో ప్రాముఖ్యత కలిగిన చిట్టివలస పేరు ఈ మార్గంలో ప్రయాణించే బస్సులపై చేర్చాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ఉచిత బస్సు పథకం ఓ బూటకం

- 'స్త్రీ శక్తి' కి సవాలక్ష షరతులు
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్నశ్రీను


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: స్త్రీ శక్తి పేరుతో కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ప్రవేశపెడుతున్న ఉచితబస్సు పథకం ఒక బూటకమని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీకి 14 రకాల బస్సులు ఉండగా, కేవలం 5 రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వడం మోసమేనన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో జరిగిన సభలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఇప్పుడు సవాలక్ష షరతులతో 5 రకాల బస్సులకే అనుమతివ్వడం మోసమేనన్నారు. దీనివల్ల విశాఖ ప్రజలు తిరుపతి వెళ్లాలంటే వారం రోజులు, అన్నవరం వెళ్లాలంటే మూడు రోజులు పడుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని గతేడాది పూర్తిగా ఎగ్గొట్టమే కాకుండా ఈ ఏడాది 25 లక్షల నుంచి 30 లక్షల మందికి ఇవ్వలేదన్నారు. అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చే వరకు వెంటాడుతూనే ఉంటామన్నారు. వాటిని ప్రజలకు తెలియచేయడానికే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ ద్వారా ప్రజల దగ్గరకు వస్తున్నామన్నారు. ప్రభుత్వంలో కొందరి పబ్బం గడుపుకోవడానికే సమోసా కూడా రాని ఒక్క రూపాయికి ఎకరాలకు ఎకరాలు దోచి పెడుతున్నారన్నారు. పరిశ్రమలు వచ్చిందీ లేదన్నారు.

ప్రజలకు అండగా ఉండి ప్రశ్నిస్తాం

కూటమి ప్రభుత్వం అరకొర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున, అవి అందని వారితో ప్రజా సమస్యల పరిష్కార వేదికలు దద్దరిల్లిపోతున్నాయన్నారు. అధికారం ఉంటే ప్రజల కోసం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజలకు అండగా ఉండి నిలదీయడం, ప్రశ్నించడం, ఒత్తిడి తీసుకురావడం చేస్తూనే ఉంటామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలె కూటమి ప్రభుత్వం నూరుశాతం సంక్షేమ పథకాలు అమలు చేసేవరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, గాడు శ్రీను, వైస్ ఎంపీపీలు పొంద్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, బోని బంగారునాయుడు, పతివాడ పుష్పలత, బోని అప్పలనాయుడు, పొంద్రంగి అప్పారావు, కోరాడ అప్పలస్వామినాయుడు, పతివాడ గోపి, కోరాడ సాధు రాంబాబు, కోరాడ దశరథ, చందక సూరిబాబు, డోల ఆనంద్, చందక స్వామి, షిణగం దామోదరరావు, నాగోతు మహేష్, ఎర్ర లప్పలనాయుడు, కోరాడ సూర్యారావు, కోన శ్రీను, లెంక రాంబాబు, తోణంగి అప్పారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వృత్తుల వారికి భీమిలిలో కమ్యూనిటీ హాల్

తగరపువలస: చేనేత వృత్తుల వారికి భీమిలిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం చిట్టివలసలో జరిగిన నేతన్నల నేస్తంగా కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం తరువాత పెద్దరంగమైన చేనేతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నైపుణ్యంతో కూడుకున్న నేతపని చేసేవారిని చేనేత కార్మికులుగా కాకుండా చేనేత కళాకారులుగా సంబోధించాలని సూచించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

తగరపువలస: ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాలలోని రేషన్ డిపో డీలర్‌పై సీఎస్‌డీటీ సోమవారం 6ఏ కేసు నమోదు చేశారు. డిపోను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన సరకులలో వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. కార్డుదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు డిపో లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

దివ్యాంగునికి ట్రై సైకిల్ బహూకరణ

సొంత నిధులతో అందించిన చిన్న శ్రీను


తోటయ్యకు ట్రై సైకిల్ అందిస్తున్న చిన్న శ్రీను

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన దివ్యాంగ మత్స్యకారుడు ఉమ్మిడి తోటయ్యకు వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తన సొంత డబ్బులు ఖర్చు చేసి రూ.60వేల విలువైన ట్రైసైకిల్‌ను అందించారు. సోమవారం సాయంత్రం వేములవలసలో అతడికి దీనిని అందజేశారు. గత నెల 25న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అన్నవరం వెళ్లిన చిన్న శ్రీనుకు తోటయ్య తన ఇబ్బందులు తెలిపాడు. ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్న తనకు ఏడాది నుంచి తిరిగినా కూటమి ప్రభుత్వం పెన్షన్ ఇవ్వలేదని తెలియజేశాడు. దీంతో అతనికి 20 రోజుల్లో ట్రైసైకిల్ ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆ గడువులోగా అందించారు. దీంతో తోటయ్య మాట్లాడుతూ చిన్న శ్రీనుది పెద్ద మనసు అని, సాయం చేయడానికి అధికారమే అక్కర్లేదని నిరూపించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ మేరుగు ఎల్లాజీ, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, మద్దిల వెంకటరమణ, బొడ్డు దుర్గారావు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: ఇటీవల విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో భీమిలిలోని బీజీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థులు తేజయశ్వంత్, జయంత్, మౌనిక, సూర్యకుమారి యోగాలో రాణించడంతో, ఈ నెల 27న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ పి.సుందర చంద్, సిబ్బంది అభినందించారు.

ధర్మారెడ్డికి నివాళులు


ధర్మారెడ్డికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిల్ల ధర్మారెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా కార్యాలయంలో నాయకులు సోమవారం నివాళులు అర్పించారు. ధర్మారెడ్డి పలు సందర్భాలలో మిల్లులో కార్మికులకు సాధించిన హక్కులను గుర్తు చేసుకున్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో మునకాల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, నీలాపు శంకరరెడ్డి, జీరు కైలాసరెడ్డి, బోర రామారావు, డెక్కతి శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 17 అర్జీలు

టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఫిర్యాదులు


జెడ్సీ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు ఇస్తున్న ఆదిత్యనగర్ వాసులు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 17 దరఖాస్తులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఫిర్యాదు చేశారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు.51/7, 51/8, 51/94లలో 1983లో ఏర్పాటు చేసిన అప్పలనర్సమ్మ లే అవుట్‌లో రోడ్డు ఆక్రమణను నిలువరించాలని ఆదిత్యనగర్ వాసులు జెడ్సీకి వినతి అందించారు. 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులో కనీస నిబంధనలు పాటించకుండా ఓ భవనం నిర్మాణం చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు జ్యోతిష్ ఫిర్యాదు ఇచ్చారు. ఏసీ నాగేంద్రకుమార్, ఈఈ శాంతిరాజు, డీఈ మణికుమార్, సూపరింటెండెంట్ అప్పలరాజు, టీపీవో బాలరాజు, ఎస్ఎస్ శ్రీనివాసరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోన్–1కు ఏడు వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి అయిదు వినతులు, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాలకు ఒక్కొక్క వినతి వచ్చాయి.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న డాక్టర్ రాజ్‌కిరణ్

మధురవాడ: నులిపురుగుల నివారణ దినం సందర్భంగాఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఈ నెల 12న పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రబృందం సభ్యుడు డాక్టర్ రాజ్‌కిరణ్ సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు అందించే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. పీహెచ్‌సీతో పాటు యూపీహెచ్‌సీలు, ఇతర ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై పీహెచ్‌సీ వైద్యురాలు దీపికను అడిగి తెలుసుకున్నారు. 19 ఏళ్ల లోపు పిల్లలందరితో మాత్రలు మింగించాలని, ఆ రోజు ఎవరైనా మాత్రలు వేసుకోకపోతే ఈ నెల 20న కూడా పంపిణీ చేయాలని సూచించారు. కన్సల్టెంట్ విశ్వనాథం,పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎం.పరమేశ్వరరావు పాల్గొన్నారు.